# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-04-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రజలకు అనుకూలమైన, నివాసయోగ్యమైన నగరంగా అమరావతిని అభివృద్ధి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

2. **తెలంగాణ ఆర్టీసి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.**

3. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఐ ఆధారిత సేవల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

4. **ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.**

5. **జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – సీఆర్డీఏ అథారిటీ 60వ సమావేశం నిన్న అమరావతిలో జరిగింది. ఈ సమావేశంలో రాజధాని నిర్మాణానికి సంబంధించిన పలు ప్రతిపాదనలపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, అమరావతిని హరిత, నీలి నగరంగా, ప్రజలకు అనుకూలమైన నివాసయోగ్యమైన నగరంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాజధాని ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని.. నగరాన్ని విజయవాడతో అనుసంధానించేందుకు కృష్ణా నదిపై నిర్మించే వంతెనను ఐకానిక్ గా నిర్మించాలన్నారు. రాజధాని ప్రాంతం వివిధ రంగాల్లో పెట్టుబడులతో పాటు ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా మారాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణ ఆర్టీసి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ లో ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం నిన్న సమావేశమైంది. ఈ సమావేశంలో ఆర్టీసీ సమ్మె, కార్మికుల డిమాండ్లు, సమ్మె ప్రభావంపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కార్మికుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్నారు. సమావేశం

అనంతరం కాబినెట్ వివరాలను తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాత్రికేయులకు వివరించారు. కొత్త ఉద్యోగాలు, కొత్త బస్సుల కొనుగోలు, మౌలిక సదుపాయాల్ని పెంచడం, కారుణ్య నియామకాలు వంటి అంశాలపై సానుకూలంగా ఉన్నామని చెప్పారు. ఆర్టీసీ కార్మికులెవరూ అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దని తెలుపుతూ, వాయిస్ 33 సెకన్లు

ఆర్టీసీ కార్మిక సంఘాలనేతలు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో ఈ ఉదయం 10 గంటలకు సమావేశంకానున్నారు

---------------------------

ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీతో పాటు వారి డిమాండ్లను పరిష్కరించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని సీతాఫల్‌మండీలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన నిన్న నిన్న పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ సమ్మెపై కేంద్ర మంత్రి మాట్లాడుతూ..ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బిజెపి పూర్తి మద్దతు ఇస్తోందన్నారు.మహిళలకు ఉచిత బస్సు పథకం విషయంలో ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులు అన్ని విధాల సహకరిస్తున్నప్పటికీ.. వారి సమస్యలు పరిష్కరించకపోవడం సరికాదని అన్నారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కృత్రిమ మేధ –ఏఐ ఆధారిత సేవలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో కృత్రిమ మేధ ఆధారిత వైద్య సేవలు సానుకూల ఫలితాలు ఇస్తున్నట్లు మంత్రి నిన్న ఒక ప్రకటనలో వెల్లడించారు."ఏపీ మెడ్ టెక్ ఇన్నోవేషన్ ఛాలెంజ్" కింద ఎంపికైన అంకుర సంస్థలు 18 ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాగ్నస్టిక్స్, టెలిమెడిసిన్, స్మార్ట్ మానిటరింగ్ వంటి నాలుగు విభాగాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందించాయని తెలిపారు. ఈ సంస్థలు 37 రోజుల్లో 12,677 మంది రోగులకు సేవలు అందించాయని, క్షయ, గ్లాకోమా, క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రారంభ దశలో గుర్తించడంలో ఏఐ కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. అలాగే వైద్యుల పనిభారం తగ్గి, సమయం 70 శాతం వరకు ఆదా అయినట్లు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలు కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిన్న ప్రారంభించారు.అనకంబట్టు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఈ పథకం కింద మొత్తం 21 వేల 673 మంది ఎస్సీ, ఎస్టీలకు రెండు కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందుకోసం 52 కోట్ల 70 లక్షల రూపాయలు కేటాయించినట్లు వెల్లడించారు. పునర్వ్యవస్థీకృత విద్యుత్ పంపిణీ రంగ పథకం–ఆర్డీఎస్ఎస్ కింద విద్యుత్ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో టిడిపి కేంద్ర కార్యాలయంలో

నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను సంబంధిత అధికారుల సమక్షంలో పరిష్కరిస్తామని చెప్పారు. పింఛన్లకు, గృహాలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వీటిపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ 27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 4 లక్షల 47 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. నెల్లూరులో మంత్రి అధ్యక్షతన జిల్లా సాగునీటి సలహా బోర్డు నిన్న సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, సోమశిల,కండలేరు, సర్వేపల్లి, కనిగిరి జలాశయాలలో సమృద్ధిగా నీరు ఉండడంతో రెండవ పంటకు సాగునీరు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రైతులు ఈ నీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరుతూ...

వాయిస్ 32 సెకన్లు

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. దేశ వ్యాప్తంగా ఉన్న పంచాయితీలకు సాధికారత కల్పించే లక్ష్యంతో ప్రతీ ఏటా ఏప్రిల్ 24వ తేదీన జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1993 ఏప్రిల్ 24న 73వ రాజ్యాంగ సవరణ చట్టం అమలులోకి వచ్చి, పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగబద్ధమైన హోదా కల్పించిన సందర్భాన్ని గుర్తుచేసుకోవడానికి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. రాజకీయ అధికారాన్ని వికేంద్రీకరించి క్షేత్రస్థాయిలో అభివృద్ధి సాధించే దిశగా పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామీణాభివృద్ధికి ప్రోత్సాహం, సామాజిక సాధికారత ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేయడం ఈ రోజు నిర్వహణ లోని ముఖ్య ఉద్దేశం.

---------------------------

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఈరోజు ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించనుంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 133 వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఎండల తీవ్రత పెరుగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా నిన్న ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. ఈరోజు రాష్ట్రంలో 62 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 89 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపింది.

తెలంగాణలోనూ సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. అలాగే రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

======================